క్లుప్తంగా

సకాలంలో విద్యార్థులకు యూనిఫాంలు



గట్టు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలను అందించేలా చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఓ పీడీ నర్సింగరావు తెలిపారు. గురువారం గట్టులోని మహిళా శక్తి కుట్టు కేంద్రాలను డీఆర్‌డీఓ పీడీ పరిశీలించారు. విద్యార్థులకు అందించే యూనిఫాంలను కటింగ్ తర్వాత పూర్తి స్థాయిలో తయారు చేసి ఎన్ని రోజుల్లో అందిస్తారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. దర్జీలు కుట్టే విధానాన్ని పీడీ పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం సాంబశివుడు, సీసీ జయాకర్, ఆంజనేయులు, జ్యోతి, వీఓఏలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

అయిజ: మండలంలోని దేవబండ గ్రామంలో బోయ చిన్న రాముడు (50) అనారోగ్యం వల్ల బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే విజయుడు బాధితులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట సంకాపురం రాముడు, ఎక్లాస్‌పురం నరసింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

ధరూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మాసన్న అనారోగ్యంతో చనిపోవడంతో ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట మండల కాంగ్రెస్ నాయకులు రాజారెడ్డి, జాకీర్, నరేందర్, దేవన్న, తదితరులు ఉన్నారు.

ఈత వనాలను విరివిగా పెంచాలి

రాజోళి: గ్రామాల్లో ఈత చెట్లను విరివిగా పెంచే విధంగా ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టాలని మండల గౌడ సంఘం మండల ప్రధాన కార్యదర్శి సిద్దయ్య గౌడ్, వడ్డేపల్లి మండల అధ్యక్షుడు రాజుగౌడ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉన్న చెట్లను పలు కారణాల చేత నరికేశారని, దీంతో గీతా కార్మికుల జీవనోపాధి పోయిందన్నారు. ఉన్నచెట్లను తొలగించడం వల్ల స్వచ్ఛమైన కల్లును తీసే కార్మికులు ఉపాధి కోసం వలస వెళ్తున్నారని, అలాంటి వారికి మళ్లీ పూర్వ వైభవం తెచ్చే విధంగా అధికారులు గ్రామాల్లో ఈత వనాలను పెంచాలని, గీతా కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. చెరువులు, కాల్వలు, రోడ్ల పక్కన ఈత వనాల పెంపు వల్ల పర్యావరణంలో మార్పులతో పాటు, కార్మికులకు ఉపాధి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వడ్డేపల్లి మండల ప్రధాన కార్యదర్శి పరమేష్‌గౌడ్, నర్సింహ, అయ్యన్న, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలపై రైతులకు అవగాహన



మానవపాడు: మండలంలోని ఏ బుర్దిపాడు, మద్దూరు గ్రామాలలో గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. పత్తి, మిరప విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు లాట్, గడువు తేదీని సరిచూసుకొని కొనుగోలు చేయాలని తెలిపారు. ప్రభుత్వం అనుమతి పొందిన దుకాణాలలో విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు

కేటీదొడ్డి: మండలంలోని పాగుంటలోని రైతులకు విత్తనాల కొనుగోలుపై ఏఈఓ జ్యోతి గురువారం రైతులకు అవగాహన కల్పించారు. కొనుగోళ్లప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. లైసెన్స్ విత్తన డీలర్ దగ్గర మాత్రమే విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు ఉన్నారు.

అదుపుతప్పి డీసీఎం బోల్తా

మానవపాడు: డీసీఎంను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఓవర్ టేక్ చేస్తుండగా పక్కకు తప్పించబోయి అదుపు తప్పి కింద పడిన సంఘటన గురువారం మండలంలోని ఇటిక్యాల శివారు ప్రాంతంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కడప నుంచి హైదరాబాద్‌కు దోసకాయ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం, అదేవైపుగా వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డీసీఎంను ఓవర్ టేక్ చేయబోయింది. డీసీఎం పక్కకు డ్రైవ్ చేయగా అదుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ చిన్న రెడ్డయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు.

డంపింగ్ యార్డులపై నిర్లక్ష్యం



మెన్నిపాడులో కాల్చేస్తున్న చెత్తలో నుంచి వస్తున్న పొగ

ఉండవెల్లి: డంపింగ్ యార్డుల్లో చెత్తను వేరు చేయకుండా కాల్చి బూడిద చేస్తున్నారు. ప్రతి గ్రామంలో చెత్తను అంటించి చేతికి ఎరువు కూడా దొరకకుండా బూడిద మిగిలేలా చేస్తున్నారు. ప్లాస్టిక్ మాత్రమే చుట్టు పక్కల పంట పొలాల్లో పంటను నష్టం చేస్తుంది. ప్రతి రోజు ఉదయాన్నే రిక్షాలతో కష్టపడి తీసుకొస్తున్న చెత్తను వేరు చేసి డంపింగ్ చేసి సెగ్రిగేషన్ షెడ్డులో తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారు. చెత్తను వేర్వేరు చేసి ఎరువుగా మార్చితే శాఖకు ఆదాయం సమకూరుతుంది. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు.



ఉండవెల్లి సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న డీపీఓ

చెత్తను వేరుచేసేదే లేదు..

అలంపూర్ నియోజకవర్గంలో 7 మండలాల్లోని ప్రతి గ్రామంలో చెత్తను వేరు చేసేందుకు గ్రామ పంచాయతీ నిధుల నుంచి డంపింగ్ యార్డుకు, సెగ్రిగేషన్ షెడ్డులను నిర్మించేందుకు అధిక మొత్తాదులో నిధులు మంజూరు చేసి అధికారులు నిర్మించారు. కొన్ని చోట్ల డంపింగ్ యార్డు నిండినా అక్కడే చెత్తను కాల్చేస్తున్నారు. కాల్చిన చెత్త రహదారిలో వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తోంది. రోడ్డు పక్కన డంపింగ్ యార్డుల్లో చెత్తను కాల్చి దుర్వాసన వెదజల్లుతూ పొగ వల్ల అనేక రోగాలు వ్యాప్తి చెందుతాయని వైద్యులు తెలుపుతున్నారు.

చెత్తలో రకాలు అనేకం..

అలంపూర్ నియోజకవర్గంలో అలంపూర్, వడ్డేపల్లి, అయిజ మున్సిపాలిటీల్లో చెత్త అధికంగా డంపింగ్ యార్డులకు చేరుతుంది. మండలాల్లో ఉన్న గ్రామాల నుంచి కూడా డంపింగ్ చేసి చెత్తను కాల్చి ఎరువును తయారు చేయలేని పరిస్థితి నెలకొంది. చెత్తను ఎరువుగా మార్చితే ఆ శాఖకు ఎంతో ఆదాయం ఉంటుందని కొందరు నిపుణులు చెబుతున్నారు. కాని వేరు చేయకపోవడంతో ఆలోచనలో పడ్డారు. చెత్తలో మురికి కాల్వల నుంచి వెలువడిన చెత్త, నిలిచిన మట్టి, ఆస్పత్రుల్లో వ్యర్థం పదార్థాలు, కాగితాలు, ప్లాస్టిక్, మద్యం సీసాలు, చిరిగిన దుస్తులు, డబ్బాలు, అనేక రకాల వ్యర్థాలు డంపింగ్ యార్డుల్లో వేరు చేయాలి. పశువుల ఎరువు కూడా డంపింగ్ యార్డులోనే ఉంటుంది. హరితహారానికి సంబంధించి ఎరువులు తయారు చేయాలని ప్రకటించినా అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడా అమలు కావడం లేదు.

చెత్త కాల్చడంతో ఇబ్బందులు..



ప్రతి గ్రామంలో చెత్తను కాల్చుతున్నారు. కాల్చడంతో చిన్న గ్రామ పంచాయతీలోకి పొగ చేరి ప్రజలను అస్వస్థకు గురి చేస్తుంది. కార్మికులు చెత్తను కష్టపడి రిక్షాలో డంపింగ్ చేస్తారు. కాని అది ఎక్కువైతే కాల్చేసి ఎరువును కోల్పోతున్నారు. అధికారులు ఆలోచించాలి.

– నరసింహ, ఆటో డ్రైవర్

మండల స్థాయి అధికారులకు సూచనలిచ్చాం..

చెత్తను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్డులో ఉంచాలని మండల అధికారులకు సూచనలిచ్చాం. కొత్తగా వర్మ కంపోస్ట్ యంత్రాలు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మంజూరు చేస్తుంది. చెత్తను ఎక్కడికక్కడే యంత్రంలోనే ఎరువును తయారు చేస్తుంది.

– వెంకటరెడ్డి, డీపీఓ, గద్వాల

వ్యాధి నిరోధక టీకాలు వేయించండి



చిన్నతాండ్రపాడులో పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

అయిజ: పశువులకు, జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూప రాణి సూచించారు. గురువారం మండలంలోని సంకాపురంలో 229 పశువులకు, చిన్న తాండ్రపాడు గ్రామ శివారులో 2,485 గొర్రెలకు వెటర్నరీ సిబ్బంది వ్యాధినిరోధక టీకాలు వేశారు. పుశువులకు గురుక వ్యాధి, జబ్బవాపు వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఉచితంగా హెచ్ఎస్, బీక్యూ వ్యాక్సినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. గొర్రెలకు, మేకలకు చిటుక రోగం రాకుండా ఉండేందుకు ఈటీ వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. రైతులు అందరూ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని కోరారు.

నరసింహాశర్మకు సన్మానం



సాహితీ అవార్డును అందుకుంటున్న నరసింహాశర్మ

వనపర్తి టౌన్: సాహితీ కళా పోషణలో విశేషంగా కృషి చేసినందుకుగాను పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాఖ్యాత డాక్టర్ నాయకంటి నరసింహశర్మకు అరుదైన గౌరవం దక్కింది. కుసుమ ధర్మన్న కళాపీఠం, పాలడుగు నాగయ్య సాహితీ పీఠం తెలుగు చైతన్య సమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనానికి వనపర్తి జిల్లా తరపున నాయకంటికి ఆహ్వానం అందింది. ఈ మేరకు సురవరం ప్రతాపరెడ్డి రచించిన రచనలు, పోరాటాలు, చరిత్రపై కవిత్వం రూపంలో అందరినీ ఆకట్టుకునేలా ఎన్నో విషయాలను వివరించారు. దీంతో ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి, ధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు డాక్టర్ రాధాకుసుమ, తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజిని తదతరులు అవార్డును అందజేస్తూ ఘనంగా సన్మానించారు. సుమారు మూడు దశాబ్దాలుగా సాహిత్యంలో ఆయన చేస్తున్న సేవలు మరువలేనివని పట్టణానికి చెందిన పలువురు సాహితీ వేత్తలు, రాజకీయ పార్టీల నాయకులు అన్నారు.

రాష్ట్ర రాజముద్ర మార్చొద్దు

అమరచింత: తెలంగాణ రాష్ట్ర రాజముద్రలో చార్మినార్‌తో పాటు కాకతీయుల తోరణాన్ని తొలగించొద్దని, అవి తెలంగాణ సంస్కృతిని చాటి చెబుతున్నాయని తెలంగాణ ఉద్యమకారుడు సయ్యద్ కలాంపాషా అన్నారు. కొత్త ప్రభుత్వం రాష్ట్ర రాజముద్రికలో మార్పులు చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. గతంలో చార్మినార్‌కు 400 ఏళ్ల సందర్భంగా సంబురాలను చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు చార్మినార్‌ను రాజముద్ర నుంచి తొలగించేందుకు యత్నాలు చేయడం తగదన్నారు.

ఆర్థోపెడిక్ క్యాంప్ విజయవంతం



భైరాపురంలో వైద్య పరీక్షల్లో పాల్గొన్న గ్రామస్తులు

ఉండవెల్లి: మండలంలోని భైరాపురం గ్రామంలోని రైతువేదికల్లో భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ(వీఎస్‌టీ ప్రైవేట్ కంపెనీ) సంజీవని ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించారు. గురువారం హెల్త్ క్యాంపులో భాగంగా 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 50 మందికి ఫీజియోథెరఫీ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్యాతూర్ పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ లక్ష్మీకాంత్, ఆర్థోపెడిక్ వైద్యులు సుబ్బారెడ్డి, ఫీల్డ్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ, వీఎస్‌టీ సంజీవని ప్రాజెక్ట్ మేనేజర్ నాగరాజు, నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శానిటేషన్ పనులు



పైపాడులోని 1వ వార్డులో జేసీబీతో షిల్టు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని పైపాడులో గురువారం శానిటేషన్ పనులు జోరుగా కొనసాగాయి. 1వ వార్డులోని బీసీ కాలనీలో డ్రైనేజీల్లో పేరుకుపోయిన షిల్టును జేసీబీతో పూర్తిగా తొలగించి మురుగు నిల్వకుండా చర్యలు చేపట్టారు. 2వ వార్డులో పూర్తి స్థాయిలో డ్రైయినేజీలు శుభ్రం చేసి ఇబ్బందులు తొలగించాలని పైపాడు వాసులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

కవులు, కళాకారులకు పురస్కారాలేవి?

శాంతినగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొట్ట మొదటిసారి ప్రభుత్వం అధికారికంగా కవులు, కళాకారులను, సామాజిక సేవకులను గుర్తించి పురస్కారాలు అందించారని, ఆ తర్వాత అందరూ గుర్తింపు కోల్పోయారని సామాజిక సేవకులు యిటిక్యాల శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మొట్టమొదటి అవతరణ దినోత్సవం సందర్భంగా కవులు, కళాకారులు, సామాజిక సేవకులకు జూన్ 2న ఆహ్వానించి రవీంద్రభారతిలో ఘనంగా సన్మానించి నగదు పురస్కారాలు అందించారని, అనంతరం కొన్నేళ్లుగా ఎవరికి పిలుపు లేకుండా పోయిందన్నారు. ఈ ఏడాదైనా కొత్త ప్రభుత్వం కళాకారులు, కవులు, సామాజిక సేవకుల వివరాలు సేకరించి వారికి ఆహ్వానం పలికి సన్మానించి వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్థిక, సామాజిక దోపిడీ నిర్మూలనే ధ్యేయం

- సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి



రాజోళిలో శిక్షణా తరగతులకు వెళ్తున్న సీపీఎం నాయకులు

గద్వాల అర్బన్: సమాజంలో ఆర్థిక, సామాజిక దోపిడీని నిర్మూలించి అసమానతలు లేని సమాజ స్థాపనే సీపీఎం ధ్యేయమని జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ దోపిడీ చేస్తున్న పెట్టుబడిదారుల కుట్రలను బయటపెడుతూ అణచివేయబడుతున్న పీడిత ప్రజలకు అండగా ఉంటామన్నారు. రాజకీయ చైతన్యంతో ఆర్థిక, సామాజిక, దోపిడీ నిర్మూలనలో జరిగే పోరాటాల్లో ప్రజలను భాగస్వాములను చేయడంలో కీలక పాత్ర పోషించాలన్నారు. సమావేశంలో రేపల్లె దేవదాస్, వీవీ నర్సింహ, మద్దిలేటి, పరంజ్యోతి, ఆంజనేయులు, విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

కార్మికుల ఐక్యతతోనే విజయాలు సాధ్యం

అలంపూర్: కార్మికుల ఐక్యతతోనే విజయాలు సాధ్యమని పుల్లూరు టోల్‌ప్లాజా యూనియన్ అధ్యక్షుడు పీటర్ అన్నారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాయతీ రహదారిపై పుల్లూరు టోల్‌ప్లాజ వద్ద సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పుల్లూరు టోల్‌ప్లాజా యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పుల్లూరు టోల్ ప్లాజా ఎంప్లాయిస్, యూనియన్ ఉపాధ్యక్షులు వెంకట్రాముడు, లాజర్, ప్రధాన కార్యదర్శి మద్దయ్య, సహాయ కార్యదర్శులు వెంకటేష్, రాజశేఖర్, కోశాధికారి శేషన్న తదితరులు ఉన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో సీఐటీయూ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అంతరాలు లేని సమాజం కోసం నిరంతరం కార్మికవర్గం కోసం పోరాడుతామన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ, రామకృష్ణ, గజేంద్ర, ఆంజనేయులు ఉన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు సీపీఎం

రాజోళి: సీపీఎం అంటే క్రమ శిక్షణకు మారుపేరని సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రం గద్వాలలో జరుగుతున్న శిక్షణా తరగతులకు గురువారం మండలం నుంచి నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో ఉన్న విధానాలు, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని ప్రజా సేవ చేస్తున్నామని, క్రమ శిక్షణతో ఉండటం వల్లనే ప్రజలు తమ సమస్యలను సీపీఎం దృష్టికి తీసుకొచ్చి, వాటిని పరిష్కరించుకుంటున్నారన్నారు. సీపీఎం చేస్తున్న పోరాటాల వల్లనే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో లక్ష్మన్న, కృష్ణ, మంజునాథ్, మోహన్ పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు సీఐటీయూ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నరసింహ, పాండు, శివ శంకర్, అశోక్, మల్లి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గట్టు: అసంఘటిత కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తున్నట్లు జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ తెలిపారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్వామి, లింగయ్య, నర్సింహ, లక్ష్మన్న, నర్సింహులు, చంద్రు, పరశురాముడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం పని చేస్తా



అలంపూర్: ప్రజా సంక్షేమం కోసం పని చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీలను గురువారం బాధితులకు అందజేశారు. ఉండవెల్లి మండల మెన్నిపాడు గ్రామానికి చెందిన పార్వతమ్మ వైద్యం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి నుంచి ఆపరేషన్ కోసం రూ.5 లక్షలు మంజూరు కావడంతో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇటిక్యాల మండలం ఆర్ గార్లపాడు గ్రామానికి చెందిన బాధితులు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వారికి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేశారు.కార్యక్రమంలో జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు గోపాల్, నాయకులు సురేష్, నాగన్న, తదితరులు ఉన్నారు.

బాధితులకు ఎల్‌ఓసీ అందజేత

మానవపాడు: ఇటిక్యాల మండలంలోని గార్లపాడు గ్రామానికి చెందిన కురువ పావని ఆపరేషన్ కోసం ప్రభుత్వం మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీ చెక్కును గురువారం ఎమ్మెల్యే విజేయుడు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ చైర్మన్ గోపాల్, సురేష్ ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో జరుగుతున్న పలు రకాల అభివృద్ధి పనులను గురువారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలను, ఎన్ఆర్ఈజీఎస్ పనులను పరిశీలించి, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఒండ్రు మట్టిని సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ కుర్మయ్య

పాన్‌గల్: ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న ఒండ్రు మట్టి తరలింపు పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ కుర్మయ్య అన్నారు. గురువారం మండలంలోని అన్నారంతండాలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒండ్రు మట్టితో పంట పొలాలకు జీవం, చెరువులు, కుంటల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. రైతులకు ఉపయోగపడే పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కూలీల మస్టర్స్‌ను తనిఖీ చేశారు. గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. వర్షాకాలం సీజన్ వరకు జీపీకి నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేసుకోవాలన్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన



తహసీల్దార్ రాజుకు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘాల నాయకులు

ఆత్మకూర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరుస్తూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టడంతో అంబేడ్కర్ యువజన సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం మండలంలోని ఆరేపల్లికి చెందిన బీజేపీ నాయకుడు తెలుగు వేణు వాట్సాప్ గ్రూపుల్లో అంబేడ్కర్‌ను కించపరుస్తూ రిజర్వేషన్ల విషయంలో వాయిస్ మెసేజ్ పెట్టినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆయా సంఘాల నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. అలాగే నిందితుడిపూ చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ నరేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఆరేపల్లి వేణుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుర్మన్న, నర్సింహ, సుధాకర్, ప్రకాష్, లాలు, మధు, కిషోర్, కురుమూర్తి, రంజిత్, దండు శ్రీను, రమేష్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

పట్టణ అభివృద్ధే ధ్యేయం

ఆత్మకూర్: మున్సిపాలిటీలోని వార్డుల్లో ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం చేస్తూ వార్డుల అధికారులు ముందుకెళ్లాలని కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ వార్డుల అధికారులతో సమావేశమయ్యారు. ప్రతినిత్యం వార్డుల్లో పర్యటించి సమస్యలను గుర్తించాలని, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, జనన, మరణాలు, జనాభా, సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాడలేని భూసార పరీక్షలు



భూసార పరీక్షలు చేస్తున్న వ్యవసాయ అధికారులు(ఫైల్)

- అవగాహన కల్పించని అధికారులు
- అయోమయంలో రైతులు

చిన్నంబావి: రైతులకు భూమి నాణ్యత, వాడాల్సిన ఎరువులను గుర్తించేందుకు అవసరమయ్యే భూసార పరీక్షలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏ రకం పంటలకు భూమి అనుకూలంగా ఉందో రైతులకు తెలిసినప్పుడే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. భూసారాన్ని ఖచ్చితత్వంతో పరీక్షించినప్పుడే ఎరువుల వినియోగంపై అంచనా వస్తుంది. పంటల సాగులో అధిక దిగుబడులను సాగించేందుకు మట్టి కీలక పాత్ర పోషిస్తుంది. మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేసి వ్యవసాయధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు. కానీ రెండేళ్లుగా భూసార పరీక్షల జాడలేదు. వానాకాలం సాగు పనులు వ్యవసాయ దుక్కులు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా మట్టి నమూనాల సేకరణ జరగలేదు.

27వేల ఎకరాల్లో సాగు

మండలంలో 27వేల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగవతున్నాయి. ఇందులో 8వేల ఎకరాల్లో మొక్కజొన్న, 2,700ఎకరాల్లో వేరుశనగ, 5వేల ఎకరాల్లో వరి, 1,400 ఎకరాల్లో మామిడి, మరో 5వేల ఎకరాల్లో ఉల్లి, మిరప వంటి వాణిజ్య పంటలను సాగుచేస్తారు. కానీ రెండేళ్లుగా మండలంలో భూసార పరీక్షలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పంటల సాగు సజావుగా సాగట్లేదు. భూమి రకాన్ని పంట చేయకపోవడంతో ఆ ప్రభావం దిగుబడులపై పడుతోంది.

రైతుకు లాభాలు ఇవే..

భూసార పరీక్షల ద్వారా భూమి స్వభావం తెలుస్తుంది. దానిలో ఉన్న పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలియడంతో దాన్ని బట్టి నేల రకానికి సంబంధించిన పంటలు సాగు చేస్తే వృథా ఖర్చులు ఉండవు. నేలకు ఆమ్ల గుణం ఉంటే వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సున్నం వాడి స్థాయి తగ్గించుకునే విషయాలపై రైతులకు అవగాహన వచ్చే అవకాశం ఉంటుంది. అదేవిధంగా మట్టిలో లభ్యమయయ్యే సూక్ష్మధాతువులు, ఇనుము, జింక్, బోరాన్ ఇతర సేంద్రియ కార్బనం, పీహెచ్ మొదలగు వాటిని గురించి రైతులకు సమాచారం కేవలం భూసార పరీక్షల ద్వారా వెల్లడవుతుంది.


అవగాహన కల్పించాలి..



ప్రతి ఏడాది వేసవి కాలంలో దుక్కులు దున్ని తొలకరి వర్షాలకు విత్తనాలు నాటుతాం. పేరుకు పంటలు పండిస్తున్నామన్నా మాటే తప్పా అధిక దిగుబడులు రావడం లేదు. వ్యవసాయధికారులు భూసార పరీక్షలు నిర్వహించి మా భూమిలో ఏ పోషకాలు అవసరమో తెలియజేస్తే వాటిని వాడి దిగుబడులు సాధిస్తాం.

– ఉమేష్‌నాయుడు, బెక్కెం

భూసార పరీక్ష చేయిస్తాం..



భూసార పరీక్షల కోసం ఎవరైనా రైతులు ఏఈఓలను సంప్రదిస్తే మట్టి నమూనాలను సేకరిస్తాం. వాటిని భూసార పరీక్ష కేంద్రాలకు తరలిస్తాం. ఇప్పటి వరకు దీనిపై అధికారికంగా ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ఆదేశాలు రాలేదు. మట్టి నమూనాలను సేకరించి కృషి విజ్ఞానకేంద్రం, భూసార పరీక్ష కేంద్రాలకు పంపిస్తే ఇరవై రోజుల్లో ఫలితాలు వస్తాయి.

– దాకేశ్వర్‌గౌడ్, ఏఓ